# హక్కుల కార్యకర్తలకు విజ్ఞప్తి

దేశంలో నానాటికి ప్రజల పై తీవ్రమవుతోన్న రాజ్యహింస–అరెస్టులు, చిత్రహింసలు, తప్పుడు కేసులలో ఇరికించడం, క్రూర చట్టాల అమలు, మహిళల పై పోలీసుల అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లలో ప్రజలను కాల్చి చంపడం, వివిధ రూపాలలో ప్రజల ఆస్థులను నష్టపరచడం, రాజ్య ప్రేరేపిత హింసాత్మక చర్యలు, రాజ్య ప్రాయోజిత 'పౌర' సంస్థల నిర్మాణం – మీరు ఎరిగిందే. ముఖ్యంగా నేటి మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలైన దండకారణ్యం, ఝార్కండ్‌లను కేంద్రం చేసుకుని పాలక వర్గాలు కొనసాగిస్తోన్న గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో ప్రజలు అనేక బాధలు ఎదుర్కొంటున్నారని మీకూ తెలుసు. ప్రధానంగా మన దేశ ప్రజలు తమ భూముల కోసం, అడవుల కోసం, సమస్త ప్రాకృతిక సంపదల రక్షణ కోసం, మరో మాటలో తమ ఉనికి కోసం వారు పోరాడకుండా బతుక లేకపోతున్నారు. మరీ చెప్పాలంటే ఈ దేశపు విశాల అటవీ ప్రాంతాలలో నిర్దిష్టంగా దండకారణ్యం, ఝార్కండ్‌లలో ఆదివాసీ ప్రజల జీవితాలు మరణపు అంచులలో జీవిస్తూ బతుకు కోసం పోరాడుతున్నాయి. ఈ పోరాటాలకు మా పార్టీ నాయకత్వం వహిస్తున్నదని మీకు విడిగా చెప్పాల్సిన అవసరమే లేదు. మా పార్టీకి గత 50 సంవత్సరాల సాయుధ పోరాట చరిత్ర ఉంది. ఈ పోరాట చరిత్రలో భాగంగానే రాజ్యహింసకు వ్యతిరేకంగానే ప్రజల పౌర, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు, ఉద్యమాలు పుట్టుకొచ్చాయన్నది నిర్వివాదాంశం. ఈ పోరాటాల కోసం దృఢంగా నిల్చిన హక్కుల కార్యకర్తలు తమ ప్రాణాలను బలి పెట్టిన చరిత్ర డా.రామనాథం నుండి ఈనాటి వరకు మీరు ఎరిగినదే.

ప్రజల హక్కుల కోసం ప్రధానంగా భారత రాజ్యాంగంలో హామీ ఇచ్చిన హక్కుల అమలు కోసం మీరు ముందుకు వస్తుంటే మిమ్మల్ని 'రాజ్యం' టార్గెట్ చేస్తోంది. మిమ్మల్ని మావోయిస్టుల అనుబంధ సంస్థల కార్యకర్తలుగానే పరిగణిస్తోంది. మిమ్మల్ని ఎంతగా వేధిస్తున్నారంటే బస్తర్‌లో మీరు పోలీసుల ఆటంకాలు, వేధింపులు లేకుండా పని చేయలేని వాతావరణాన్ని వారు కల్పిస్తున్నారన్నది మాలినీ సుబ్రహ్మణ్యం, శాలినీ ఘెరా నుంచి బేలా భాటియాల వరకు అనుభవిస్తున్నదే. మిమ్మల్ని నడి బజార్లో వాహనాలతో గుద్ది చంపాలంటూ లంపెన్ శక్తులను సుక్మా మాజీ ఎస్‌పీ ఎలిసెల రెచ్చగట్టిన విషయం మీ హక్కుల పోరాటాల ఉద్యమ చరిత్రలో నిలిచిపోయింది. అంతేగాదు తాజాగా గఢ్‌చిరోలి (మహారాష్ట్ర)లో భూంకాల్ సేన (ప్రభుత్వ–పోలీసు ప్రాయోజిత సంస్థ) సంస్థాపక నాయకుడు అరవింద్ సోవ్‌నీ దేశంలో ఆదివాసీ శ్రేయోభిలాషిగా గొప్ప పేరున్న దివంగత బాబా ఆమ్టే కుమారుడు ప్రకాశ్ ఆమ్టే కుటుంబాన్ని మావోయిస్టుల సమర్థకులంటూ వేధించడం మొదలైంది.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఏ విధంగా తీవ్రతరమవుతోందో అదే స్థాయిలో ప్రజాహిత శక్తుల పై, హక్కుల కార్యకర్తల పై పోలీసుల దాడులు, వేధింపులు పెరిగిపోయాయి. వీటన్నింటినీ మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. రాజ్యం మిమ్మల్ని వెంటాడుతూ ఎన్ని రకాలుగా హింసిస్తున్నా, రెచ్చగొడుతోన్నా మీరు నిర్భయంగా, సాహసంగా మీరు నమ్మిన ఆశయాల కోసం మీ శక్తి మేరకు ప్రజల పక్షాన నిలిచి నిజాయితీగా న్యాయ పోరాటం చేస్తున్నందుకు మా పార్టీ మీ అందరికీ పేరు పేరునా విప్లవాభివందనాలు తెలుపుకుంటుంది. సల్వా జుడుం నుంచి 'అగ్ని' వరకు తెల్ల భీభత్సాన్ని

ఓడించడంలో మీరు పోషించిన చెప్పుకోదగిన పాత్రను బాధిత ప్రజలు ఎన్నటికీ మరువరు.

మా పార్టీ నాయకత్వంలో పీఎల్‌జీఏ గెరిల్లాలు పోలీసుల పైన, వారి ఇన్ఫార్మర్ యంత్రాంగం పైనా ప్రజా తీర్పు మేరకు చర్యలు చేపట్టిన మరుక్షణం నుండి వాటిని మీరు అనివార్యంగా ఖండించి తీరాల్సిన విధంగా పోలీసులు, రాజకీయ నాయకులు, మంత్రులు మీ పై తీవ్ర ఒత్తిడి చేస్తున్న విషయం జగమెరిగిందే. విశాల విప్లవోద్యమంలో ఎక్కడ ఎలాంటి పొరపాటు మా వైపు నుండి జరిగినా, మీరు అలా భావించినా మీరు మీ నియమాలు, విధానాలు అనుసరించి మీ ప్రతిక్రియను వ్యక్తం చేయడం పై మాకెలాంటి అభ్యంతరం లేదు. మా పొరపాట్ల మూలంగా ప్రజలకు ఎక్కడ ఏ మేరకు నష్టం కలిగినా, మా పార్టీ వెంటనే తప్పును అంగీకరిస్తూ బహిరంగంగా క్షమాపణలు కోరుతున్న విషయం పారదర్శికమైనదే. ముఖ్యంగా మా గెరిల్లాలు అమర్చిన మందు పాతరల ప్రమాదాలలో పొరపాటున ప్రజల ప్రాణాలకు హాని జరిగినప్పుడు మేమెలాంటి శషభిషలకు లోనవకుండా, 'కొల్లెటరల్ డామేజ్' లాంటి రాద్ధాంతాలకు చోటివ్వకుండా తప్పును సూటిగా అంగీకరిస్తూ బాధిత కుటుంబాలకు క్షమాపణలు కోరుకుంటున్నాం. ఇదంతా మేం చెప్పదలచుకున్న విషయానికి ఒక పార్శ్వం కాగా మరో పార్శ్వం, మీరు ఆలోచించాల్సింది కింద పేర్కొంటున్నాం.

భారత పాలక వర్గాలు దేశంలో విప్లవోద్యమాన్ని అణచివేయడానికి కొనసాగిస్తోన్న బహుముఖ యుద్ధంలో మానసిక యుద్ధానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. విప్లవోద్యమం పై అనేక రకాల తప్పుడు ప్రచారాన్ని కొనసాగించి ప్రజలలో దాని పట్ల తీవ్ర వ్యతిరేకతను సృష్టించడం అందులో ఒక భాగం. విప్లవోద్యమంలోనే అంతర్గతంగా అనేక అవిశ్వాసాలను పెంచి దానిని నీరు గార్చడం, విప్లవ శక్తులను బలహీనపరచడం, లొంగదీసుకోవడం దాని లక్ష్యాలలో భాగమే. ఇందులో భాగంగానే వాళ్లు ముఖ్యంగా మిషన్ 2016, మిషన్-2017లో అనేక రకాల తప్పుడు ప్రచారాలకు ఒడిగడుతూ అనేక ప్రజా వ్యతిరేక చర్యలకు మమ్మల్ని బాధ్యులను చేస్తూ ప్రజలలో అపోహలు, అవిశ్వాసాలు కలిగించడానికి విపరీతంగా కుట్రలకు, కుహకాలకు పాల్పడుతున్నారు. పోలీసు ప్రచారాలను యధాతథంగా నమ్మే వాళ్లు అవన్నీ నిజాలనుకోవడమే కాకుండా వాటిని వ్యాపింప చేయడంలో తమ వంతు పాత్ర తాము పోషిస్తున్నారనీ నిస్సందేహంగా చెప్పవచ్చు. అనేక వదంతులు పని కట్టుకుని ప్రచారం చేస్తున్న పరిస్థితులలో సాధారణ ప్రజల మాట ఎలా ఉన్నా మీ లాంటి బాధ్యత గల వ్యక్తులు, సంస్థలు నిజానిజాలను పూర్తిగా పరిశీలించకుండా ఎలాంటి చర్యల పైనైనా మీ ప్రతిక్రియను వ్యక్తం చేయడం అన్ని సందర్భాలలో సరైంది కాకపోవచ్చు. కొన్ని సందర్భాలలో పొరపాట్లకూ, అపార్థాలకూ దారి తీయవచ్చు. పోలీసులు సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకుంటూ అనేక సందర్భాలలో గందరగోళాన్ని వ్యాపింప చేస్తున్న సమయాలలో ఓపికతో వాస్తవాలను తెలుసుకోవడం మరీ అనివార్యం అవుతుందనేది విడిగా మీకు చెప్పాల్సిన పనే ఉండదు. ఇలాంటి ఉదాహరణలు కొన్ని చూద్దాం.

2017 జనవరి 19 నాడు నారాయణపూర్ జిల్లా (ఛత్తీస్‌గఢ్) ఘోడాగాంలో మందు పాతర పేలి ముగ్గురు మహిళలు మరణించి మరి కొంత మంది గాయపడినారనే వార్త వైరల్ అయింది. దీని పై ఆఘమేఘాల మీద పోలీసులు మావోయిస్టులను నిందిస్తూ ప్రచార, ప్రసార సాధనాలను దుర్వినియోగం చేస్తూ విస్తృతంగా నిందా ప్రచారానికి లంఘించుకున్నారు. ఆ రోజులలో బస్తర్ ఐజీగా ఉన్న కల్లూరి శివరాం ప్రసాద్ నారాయణపూర్‌లో బాధిత ప్రజలతో ర్యాలీలు నిర్వహించడం,

పోలీసులే వక్తలుగా ఖండన, మండనలు చేయడం, దొరికిందే అవకాశంగా తీసుకుని హక్కుల కార్యకర్తలకు మావోయిస్టులతో ప్రాణాపాయాలున్నాయనే మందస్తు హెచ్చరికలు చేయడం కాంతి వేగంతో జరిగిపోయాయి. ఈ ప్రచారాన్ని నమ్మి మావోయిస్టులను నిందించిన వారిలో పీయూసీఎల్ లాంటి సంస్థలు కూడా ఉండడం విచారకరం. కానీ, వాస్తవానికి ఈ మందు పాతర ఘటనతో మా పార్టీకి ఎలాంటి సంబధం లేదు. వాస్తవానికి అక్కడ ఏ మందు పాతర పేలలేదు. పోలీసుల ప్రచారానికీ, వాస్తవానికి ఆవగింజంతైనా పొంతన లేదు. వాస్తవాలిలా ఉన్నాయి. ఆ గ్రామ పరిసరాలలో గస్తీ చేసిన పోలీసులు పోగొట్టుకున్న ఒక మోర్టార్ షెల్ అడవిలో ఆ గ్రామస్థులకు దొరికింది. పోలీసుల తూటాలు, షెల్స్ ప్రయాణాలలో పడిపోవడం అవి గ్రామస్థులకు దొరకడం సాధారణమే. అలా దొరికిన షెల్ ఒక మహిళ తెచ్చి తనతో ఉన్న వారికి అందిస్తూ, దాని గురించి తెలియదు కనక దాన్ని విసిరివేసింది. అప్పుడు అది పేలి, పక్కన ఉన్న వారు గాయపడ్డారు. దీని పై ఊళ్లో ప్రజల పంచాయితీ నిర్వహించి సమస్యను అర్థం చేసుకొని పరిష్కరించుకున్నారు. దీని పై మా పార్టీ వైపు నుండి స్పష్టమైన ప్రకటన వెలువడే వరకు జరిగిన జాప్యంతో జరగకూడని విష ప్రచారం జరిగేపోయింది.

మరో వైపు పోలీసులే విప్లవోద్యమ ప్రాంతాలలో మందు పాతరలు అమర్చడం, వెలికి తీయడం గత రెండేళ్లుగా మున్నెన్నటికన్నా దండకారణ్యంలో పెరిగిపోయింది. వాటి మూలంగా ప్రజలకు నష్టం కలిగిన సందర్భాలలో మా పార్టీని దొంగే! దొంగ, దొంగ అని అరచిన చందంగా నిందించడం పోలీసులకు పరిపాటైంది. పోలీసుల మరో దుర్మార్గమైన ప్రచారాన్ని చూద్దాం.

జనవరి 22 నాడు హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలోని ఆంధ్రప్రదేశ్‌లో విజయనగరం జిల్లాలో ప్రమాదం పాలై అనేక మంది ప్రయాణీకులు మృతి చెంది, చాలా మంది గాయాల పాలయ్యారు. ఈ ఘటన వార్తలు వెలువడుతున్న క్రమంలోనే ఎలాంటి పూర్వాపరాల పరిశీలన లేకుండానే బస్తర్ మాజీ ఐజీ ఎస్ఆర్‌పీ కల్లూరి రంగంలోకి దిగి ఈ దుర్ఘటన వెనుక వెనుక మావోయిస్టుల హస్తం ఉందంటూ తేల్చేసి ప్రకటనల గుళ్ల వాన కురిపించారు. మరో వైపు ఒడిశా పోలీసులు రైలు ప్రమాదం పై తమ అంచనాను ప్రకటిస్తూ మావోయిస్టులు కారణం కాదంటూన్నప్పటికీ కల్లూరి మాత్రం ఎడతెరిపి లేకుండా తనదైన శైలిలో పదే పదే ప్రకటనలు వైరస్ చేస్తూ మీడియాను ఉక్కిరి బిక్కిరి చేశాడు. ఆ సమయంలోనే బస్తర్ డివిజన్‌లో మరో సంఘటన చోటు చేసుకుంది. దాని పై ఐజీ కల్లూరి గాలిలో కత్తులు ఎలా తింపాడో చూద్దాం.

దంతెవాడ జిల్లాలోని డోల్‌కల్ కొండ పైనున్న వెయ్యేళ్ల నాటి ప్రాచీన వినాయక విగ్రహం జనవరి నెలలో పై నుంచి నేల మీద పడిపోయింది. ఆ వార్త భక్తుల ద్వారా భగ్గుమనేసరికి ఐజీ కల్లూరి సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమయ్యాడు. ఆ విగ్రహం మూడు వేల అడుగుల పై నుండి నేల రాలి 16 ముక్కలు కావడం వెనుక మావోయిస్టుల కుట్రలు కారణం అంటూ ప్రజల సున్నితమైన భావాలపై ప్రచార కత్తుల సాము చేశాడు. కానీ వెంటనే రంగంలోకి దిగిన పురాతత్వ శాస్త్రవేత్తలు తీగ లాగితే డొంకంతా కదిలిన చందంగా రాష్ట్రంలో పురాతత్వ సంపదల అధ్వాన్న స్థితి గురించి, వినాయక విగ్రహం నేల రాలడం వెనుక అవకాశం ఉన్న అనేక సహజ కారణాల గురించి తమ అంచనాలు ప్రజల ముందుంచారు. వారెవరూ ఎక్కడా మావోయిస్టుల ప్రసక్తే ఎత్తుకోలేదు. ప్రజల భక్తి, విశ్వాసాలతో పోలీసుల్లా ఎన్నటికీ మావోయిస్టులు మూర్ఖంగా

వ్యవహరించరనే కనీస జ్ఞానం ఉన్నవారెవరూ మావోయిస్టుల ప్రస్తావన తీసుకురారు.

పోలీసులు ఒక్క బస్తర్ డివిజన్‌లోనే కాదు దేశవ్యాప్త మావోయిస్టు విప్లవోద్యమ ప్రాంతాలలో ఇలాంటి దుష్ప్రచారాన్ని తమ మానసిక యుద్ధం (సై-వార్)లో భాగంగా చేపట్టి ముమ్మరం చేస్తున్నారు. బస్తర్ పొరుగున ఉన్న గఢ్‌చిరోలిలో మహారాష్ట్ర పోలీసులు తామేమి తీసిపోలేదనట్టు బస్తర్ పోలీసులతో పోటీ పడుతూ ప్రచారం చేస్తున్న ఖాకీల కథనాలు చూద్దాం.

2017 ఏప్రిల్ మొదటి వారంలో గఢ్‌చిరోలి జిల్లా అహెరి తాలూకా కమలాపూర్ ప్రాంతంలోని కోలమర్క అడవులలో మావోయిస్టులతో తమకు కాల్పులు జరిగాయనీ, మావోయిస్టుల మాటు దాడి విఫలమైందనీ మరాఠీ దినపత్రికలలో తాటికాయంత అక్షరాలతో రాయించారు. కోర్చి తాలూకా తల్వార్‌గఢ్ కొండలలో మావోయిస్టులతో కాల్పులంటూ కల్పిత ఘటనను సృష్టించారు. పోలీసుల పుర్రెల్లో పుడుతోన్న ఇలాంటి కల్పిత కాల్పుల సంఘటనలు తరచుగా వెలుగులోకి రావడం చాలా కాలంగా చూస్తున్నదే కాగా తాము నాటిన మందు పాతరలు మావోయిస్టుల పేరుతో వెలికి తీయడం, ప్రజలలో భయోత్పాతాలు సృష్టించేలా పేల్చేయడం, ఈ మధ్య కాలంలో పెరిగింది. వాటిల్లో ప్రజల ప్రాణాలకు హాని జరిగితే ఆ తప్పు మావోయిస్టుల పైకి నెట్టి చేతులు దులుపుకోవడం కూడా నిస్సిగ్గుగా చేస్తున్నారు. గఢ్‌చిరోలి జిల్లా అహెరి తాలూకా ఆలపల్లి ప్రాంతంలో మోసం గ్రామ అడవులలో పోలీసులు ఏప్రిల్ నెలలో మందు పాతరలు సృష్టించి పేల్చారు. గత సంవత్సరం ఈ పరిసర అడవులలోనే తెలంగాణా విప్లవకారులు కా.చార్లెస్ టీంను పోలీసులు ద్రోహంతో కాల్చి చంపిన ఘటనను తాజాగా ఉంచడానికే పోలీసులు ఈ మందు పాతర పేలుడు దుశ్చర్యకు పాల్పడ్డారు.

పైన తాజా ఘటనలు మాత్రమే పేర్కొన్నాం. పైన పేర్కొన్న ఏ ఘటనతో కూడా మా పార్టీకి అణు మాత్రం సంబంధం లేదు. అవసరమనుకుంటే వీటిని మీరు ఎవరైనా ప్రజల్లోకి వచ్చి పరిశీలించవచ్చు. మాకు సంబంధం లేని ఘటనలను పోలీసులు మాకు ఆపాదిస్తూ చేస్తున్న బూటకపు ప్రచారాన్ని హక్కుల కార్యకర్తలెవరూ నమ్మి మోసపోకూడదనీ మా పార్టీ పదే పదే విజ్ఞప్తి చేస్తోంది. ఇలాంటి సైనిక చర్యలలో ప్రజల ప్రాణాలకు హాని జరిగిన పక్షంలో నిజానిజాలను క్షుణ్ణంగా పరిశీలించకుండా మా పార్టీ చర్యగానే మీరూ భావించి దాని పై వెన్వెంటనే మీ ప్రతిక్రియను వెలువరించకూడదని కోరుతున్నాం. మా మూలంగా ప్రజలకు అకారణంగా ఏ చిన్న నష్టం జరిగినా మేం దానికి పూర్తిగా బాధ్యత పడుతూ పొరపాటును అంగీకరిస్తాం కాబట్టి మీరు మీ సోర్సుల ద్వారా అన్ని కోణాలలో ఘటనల పూర్వాపరాలను పరిశీలించి మీ ప్రతిక్రియను వెలువరిస్తారనీ మరీ మరీ కోరుతున్నాం.

**విప్లవాభివందనాలతో**

**ప్రతాప్**

**అధికార ప్రతినిధి**

**మధ్య రీజినల్ బ్యూరో, కేంద్ర కమిటీ**

**భాకపా (మావోయిస్టు)**